# సంగమం

-పంజాల జగన్నాథం

జబ్బుపడ్డ తల్లి, పెళ్లి అయి ఇంటిమీదున్న చెల్లె, చదువబ్బక ఏ పనీ చేయకుండా అవారాగా తిరిగే తమ్ముడు. తండ్రి మరణంతోటి చిన్న వయస్సులోనే పెద్ద బాధ్యతలు వహీద్ మీద పడ్డాయి. వహీద్ తండ్రి మన్సూర్ అలీఖాన్ ఇరిగేషన్ శాఖలో చప్రాసి. మందు పాతరకు బలై కాలగర్భంలో కలిసిపోయిన అభాగ్యుడు. వహీద్ గుండెల్లో గత జ్ఞాపకాల శకలాలు కదల సాగినాయి.

గోదావరి నదీ తీరాన రాయికల్ గ్రామం వహీద్‌ది. కాలం ఆబాదిగా ఉన్న రోజుల్లో రాయికల్ గ్రామం పచ్చని చేలతో కళకళలాడేది. నిండు గోదారితో, పంట కాలువల తోటి జలకళ ఉట్టి పడేది. కాలం లేక వాగులు, వంకలు, ఒర్రెలు, చెర్లు, కుంటలు, గోదారి అన్నీ ఎండి పోయినయి. కాలం కరుణిస్తే గోదారి పారితే మహారాష్ట్ర నుండి ఆంధ్రకు నీళ్లు చేరుడే కష్టం. మధ్యన ఎన్నో చెక్‌డ్యామ్‌లు. తలాపున చెరువు... నీళ్లకు కరువు... అన్నట్లుండేది రాయికల్. కరువుకు, పేద రికానికి ఆనవాలుగా మిగిలి పోయింది.

ఊరి చివరన ఓ తాటాకుల గుడిసె. గుడిసె ముం దట ఎన్నోతరాలకు గుర్తుగా ఓ పెద్ద యాపచెట్టు. గుడిసె కప్పక ఎన్నోదినాలయింది. కమ్మలు కర్జుపట్టి చీకిపోయినయి. గుడిసె కప్పుకు అక్కడక్కక తూట్లు పడ్డాయి. గుడిసెలో ఎండ ఏటవాలుగా పడతది. ఆ పూరి గుడిసెకు యజమాని మన్సూర్ అలీఖాన్. అతని భార్య జిలాని బేగమ్. ఆ దంపతులకు నలుగురు సంతా నం. ఇద్దరు కొడుకులు వహీద్‌ఖాన్, ఆరిఫ్‌ఖాన్. ఇద్దరు కూతుళ్లు ఆనిస్, రిజువానా.

ООО

"పంపుచార్ అచ్ఛా బనావో! హమారెపె బరోసాసే గిరాకీ ఇదరారా...!" అంటూ మన్సూర్ తన పెద్దకొడుకు వహీద్‌కు పంచర్ సరిగా చేయమని హెచ్చరించి దఫ్తర్‌కు పోయిండు. మన్సూర్ తెల్లని కుర్తా, పైజమా వేసుకొని సీదాసాదాగుంటడు. కల్లాకపటం తెలియని మనిషి. ఆఫీసుల పెద్ద ఇంజనీరు సాబుకు వంటజేసి పెదుతాడు. దఫ్తర్‌ల ఏ చిన్నపార్టీ అయిన వంటలు మన్సూర్ జేసేవాడు. టేబుల్లమీద నోరూరించే వంట కాలు నిమిషాల మీద ఘుమఘుమలాడేటివి. దఫ్తర్‌ల మన్సూర్ అందరితోటి వినయంగా ఉండేవాడు. ఎవ్వరేపని చెప్పినా చేస్తూ తలల్లో నాలుకలా మెదలే వాడు. అందుకే ఆఫీసులో అందరూ మన్సూర్ అంటే ఇష్టపడే వాళ్లు.

మృగశిరకార్తె. వానాకాలం మొదలయింది. మేఘా ల్లేవు. కాలం లేదు. గాలి వీస్తలేదు. ఉబ్బరిస్తుంది. కుంపట్ల పెట్టినట్లుంది వాతావరణం. పొద్దుటిపూటనే వహీద్‌కు చెమటలు కారుతున్నాయి. వాళ్ల గుడిసె ముందు యాపచెట్టు కిందనే సైకల్ కంపెని. వహీద్ పంచర్ ఒడాయించటానికి సైకిల్ ముందు పెట్టు కున్నాడు. టైరు విప్పి ట్యూబ్‌ల గాద్పు కొట్టిండు. తట్టల ఉన్న నీళ్లల్ల ట్యూబ్‌ను ముంచుకుంటూ చెక్ చేశాడు. ఓ చోట గాలి తుస్సుమంటుంది. నీళ్లల్ల బుడగలు వస్తున్నాయి. వహీద్ బెజ్జాన్ని దొరికించుకొని సన్నని యాపపుల్లను గుచ్చిండు. ట్యూబ్ మొత్తం చెక్ చేసిండు. వేరే ఇంకెక్కడ పంచర్లు లేవని యకనీయినంక ట్యూబ్‌ల గాలి తీసిండు. బెజ్జం వద్ద రేకుమల్ కాగితం తోటి రోకి గరం ప్యాచ్ వేసిండు. గాలికొట్టి నీళ్లల్ల ట్యూబ్‌ను మల్లీ చెక్ చేసిండు. లీక్‌లేదని నమ్మిక కల్గినంక ట్యూబ్, టైర్ పయ్యకు ఎక్కించిండు. వాల్ బిగించి గాద్పు కొట్టిండు. సైకిల్ తుడిచి తయారు బెట్టిండు గిరాకి అతని కొరకు. చెమటలు తుడుచుకుంటూ వహీద్ అతని కోసం ఎదురు చూస్తున్నడు.

"సైకిల్ తయారయిందా...?" పంచర్ జొడాయిం చటానికి ఇచ్చిన అతను వచ్చిండు.

"తయార్ హై...! ఇగో తీసుకుపో" అని వహీద్ చెప్పిండు. టైర్ ఒత్తి గాలి ఉందీ, లేందీ చెక్ చేసు కున్నడు. పంచర్ చార్జీలు అయిదు రూపాయలు వహీద్‌కు ఇచ్చిండు గిరాకి అతను. దోతి సింగులు మీదికి చెక్కుకొని సైకిల్ ఎక్కి గంట కొట్టుకుంట సర్రన వెళ్లిపోయిండు. చేతిమీద గిరాకి లేక వహీద్ చిందరవందరగా పడి ఉన్న పానాలు, నట్లు, బోల్టులు సదురుకున్నాడు. బెంచీ, మేజు, కుర్చీ గుడ్డతోటి దులి పిండు. పక్కన ఎరుకలి తడకల తోటి కట్టిన పైన తాటికమ్మల కప్పు కల్గిన బుట్టి హోటలుంది. హోటల్లో బెంచీల మీద ఇద్దరు, ముగ్గురు కూకొని చాయ్ తాగు తున్నారు. ప్రస్తుత రాజకీయాల మీద ముచ్చట్లు

సాగుతున్నాయి.

స్టౌ మీద చాయ్ మసలుతుంది. పొద్దుటి నీరెండల పొగలు కనబడుతున్నాయి. వహీద్‌కు గిరాకీ లేక పొద్దు పోతలేదు. ఏం మనసు పట్టక హోటల్‌కు పోయి చాయ్ తాగుతున్నడు. కొందరు చాయ్ తాక్కుంట పేపరు చదువుతుండ్రు. డాక్టర్ల సమ్మె... ఆర్టీసీ స్ట్రైక్... ఆర్టీసీ ప్రైవేట్ జేస్తరట... ఆర్టీసి లాస్‌లుందట... ఉండదా మరి...! పెద్దచేపల్ని ఎవలు పట్టుకోవాలె! ఉద్యోగులు సమ్మె...! వాళ్లెందుకు జేస్తున్నరు...? ఇంకెందుకు జీత బత్తేల కొరకు...! గిప్పుడే మంత్రుల విదేశాలు టూర్లు, ఓ దిక్కు వరదలు ముంచెత్తుతున్నయి. రోమ్ తగలబడి పోతుంటే నీరో కూకుని ఫిడేల్ వాయించిండంట. గట్లుంది మన పరిస్థితి. ఒగల మీద ఒగలు బురద జల్లుకునుడు తప్పితే పబ్లిక్‌ను పట్టించుకునేటోళ్లు లేరు... ఏవేవో మాటలు... వహీద్ చెవులకు సోకుతున్నయి. విన్నకొద్దీ వహీద్‌కు దునియా మీద ఎక్కడలేని కోపం ముంచుకొస్తుంది. ఒకాయన దూరాన్నుంచి సైకిల్ నడిపించుకుంటూ వస్తున్నాడు. అతనది భారీకాయం. పొట్ట ఊగుతోంది. చెమటలు కారుతున్నయి. అంగి తడిసింది. మొసపోస్తున్నాడు. వహీద్ అటువైపు చూస్తు న్నాడు. సైకిల్ ముందటి పైయ్యల గాడ్పు లేదు. పంచర్ గిరాకీ వస్తోందని వహీద్‌కు లోలోపల సంబరమైతుంది.

"లచ్చన్నా...! నువ్వేనా...! ఏందే పంప్‌చరాయంది నడుసుకుంట వస్తన్నావ్...!" అడిగిండు వహీద్.

"అరె బయ్యా వహీద్ నేనే... ఇంటకెళ్లి బయటె ల్లేటప్పుడు పయ్యలగాడ్పు దిగిపోతే పంపుతోటి గాడ్పు కొట్టుకొని చేనుమొకానా బయలుదేరిన. దార్లెగా గుండ్లకింది కొండన్న కలిస్తే చేనుకు ఏ పురుగు మందు కొట్టన్నో తెలుసుకున్న! గంతట్లోనే పయ్యల గాలి తుస్సుమంది.

"అనుమానం లేదు లచ్చన్నా....! గది దొంగ పంప్‌చరే. గట్లనే సతాయించుతుది. జరగట్ల నువ్వు కూకో.... జొడాయించి ఇస్తా".

లచ్చన్న కూచొని దినపత్రిక తిరిగేస్తున్నాడు. 'కోడలును చెరిచిన మామ... విద్యార్థిని గర్భం చేసిన ఉపాధ్యాయుడు.... లంచం తీసుకుంటున్న ఉద్యోగి పట్టివేత... దేవుడి మాన్యం కబ్జా....' ఛ పేపర్ నిండా గిసోటి వార్తలే అనుకుంటూ లచ్చన్న విసుగ్గా 'దిన పత్రికను మేజు మీదకి ఇసిరి కొట్టిండు. ఇంతట్ల వహీద్ పంచర్ జొడాయించి సైకిల్‌ను పేగుతోటి తుడుచి పెట్టిండు. పయ్య ఒత్తి చూసుకున్నంత లచ్చన్న కీసల

# గరీబ్బతుకులు

గొప్పోళ్ళ–
మొసాలకు మీసాలు మొలిచాయి.
అన్యాయాలకు రెక్కలు విరిసాయి
ఆనందపుదారుల్లో పయనించే పేద
మనుషులకు జీతమనెడి నీడ కరువైంది

విరిగిన మోచేతిని పట్టుకు
పరిగెడుతున్నాడు – గరీబు!
వెనక్కి తిరిగి చూసుకుంటే....
తన మాసిన అడుగుల గుర్తుల్లో
రక్తపుటేరులు –
ఆ దారి పొడవునా విరిగి
చెల్లా చెదురుగా పడివున్న 'ఉన్నోళ్ళ'
కళ్ళ జోళ్ళు సీసపు ముక్కలు

మరుగున పడిన బడుగు
జీవుల పరిస్థితి
మోయలేనంటోంది ధాత్రి
మారిపోతానంటోంది ప్రకృతి

గొప్పోళ్ళ–
మొసాలకు మీసాలు మొలిచాయి.
అన్యాయాలకు రెక్కలు విరిసాయి.
వెన్నంటి వున్న బీదతనాన్ని
తనతోపాటు బూడిదయి
తీసుకుపోదామనుకుంటే
చక్కాకొట్టి విడిచి పారిపోయింది–
వేరే గరీబు పెంకుటింటిలోకి
చచ్చిన గరీబు పెదవుల్లో చిన్నగా
నవ్వు.... తిరిగి మళ్ళీయేడుపు

యమభటుల లోహపు హస్తాల్లో బందీయై
"బీదవారు" అనున్న యారోమార్కు వేపు
వెడుతున్నది బీదాత్మ.
గొప్పోళ్ళ మీసాలకు చురక లంటించాలి
వారి అన్యాయాల రెక్కలు విరగ్గొట్టాలి
రేపటి బీదవాడు

–సలిగంటి విజయకుమార్

నుంచి ఓ అయిదు రూపాయలు తీసి వహీద్‌కిచ్చి "పోతర బై....!" అంటూ దోతి సింగులు పైకి చెక్కుకొని సైకిలెక్కి తొక్కుకుంట తన చేనుమొకానా పోయిండు.

వహీద్, వాళ్ల అబ్బా మన్సూర్ ఇద్దరు కలిసి సంపాయించినా కుటుంబం గడుస్త లేదు. బతుకుంతా అద్దమద్దమే అయితంది. వహీద్ ఇంట్ల ఎప్పుడు ఎవలో ఒకలు దగ్గో... జరమో... బాధపడుతూనే ఉంటారు. వహీద్ అమ్మ 'ఛే' దగ్గుతోటి అవస్థ పడు తుంది. మందులు వాడుతుంది కురాక్ లేదు. ఆరాం లేదు. దగ్గు కమ్మి అయిత లేదు. దగ్గినప్పుడల్లా తెమడ పడుతుంది. ఈ నడుమ అప్పుడుప్పుడు నెత్తురు కూడా పడుతుంది. వహీద్ పెద్దచెల్లె ఆసీన్‌కు లగ్గం అయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు. రిజ్వానాకు లగ్గం అయినా కానట్టే అయింది. పెట్టుబోతలు సరిగా పెట్టలేదని తోలుక పోతలేరు. మన్సూర్ చిన్నకొడుకు ఆరిఫ్‌కు చదువబ్బలేదు. చెడుసోపతుల తోటి పనిపాట చేయ కుండా ఆవారగా తిరుగుతుండు. 'వాడెట్లా బాగుపడ తడా...' అనేదే మన్సూర్‌కు పెద్ద రందయింది.

ఇంతట్లో ఎవరో ఒకతను పిడుగు అసొంటి వార్త మోసుకొచ్చిండు. వింటూనే వహీద్ అమ్మ కుప్ప కూలింది. వహీద్‌కు కాళ్లకింద భూమి కదిలినట్ట యింది. కాళ్లూ, చేతులు ఆడుతలేవు. హుటాహుటిన వహీద్, వాళ్ల అమ్మ జిలాని జగిత్యాల సర్కార్ దవాఖా నకు పోయింగ్రు. పొద్మాకి ఆఫీసు జీబుల మన్సూర్ శవాన్ని ఇంటికి తీసుకు వచ్చింగ్రు. శవం నెత్తురుతోటి తడిసి ఉంది. దవాఖాన్ల పోస్టుమార్టమ్ చేసింగ్రు. నక్సలైట్లు పొరపాటున పోలీసోళ్ల జీబనుకొని ప్రయాణికుల జీబును మందుపాతర తోటి పేల్చింగ్రు. ప్రయాణికులందరు అక్కడికక్కడే చచ్చిపోయింగ్రు.

మన్సూర్ కుటుంబ బంధనాల నుండి తప్పించు కున్నాడు. కుటుంబ సభ్యుల దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది. ఘొల్లుమన్నారు. ఆవేదనకు, ఆత్మీయతకు ఏ మతాచారాలు అడ్డూ రాలేదు. ముసాఫిర్‌గ తిరుగుతున్న ఆరిఫ్‌కు ఈ కబురు తెలిసి ఇంటికి దౌడు తీసిండు. అబ్బా శవం మీద పడి ఏడ్చిండు. అమ్మ, అన్నను పట్టుకుని కుమిలి కుమిలి ఏడ్చిండు. అక్కా చెల్లెండ్లను దగ్గరకు తీసుకున్నాడు. ఆఫీసు వాళ్లు చావుఖర్చులకని కొంత పైకం ఇచ్చింగ్రు. మన్సూర్ దోస్తులు, చుట్టుపక్కల వాళ్లు ముస్లిం సాంప్రదాయం ప్రకారం సమాధి చేసింగ్రు. గోరి కట్టించింగ్రు.

మన్సూర్ మంచితనం వల్లనే జల్దిన్నే వహీద్‌కు తన తండ్రి నౌకరి ఇచ్చింగ్రు. అబ్బా చావుతోటి బేకార్‌గా, గైర్ జిమ్మదారిగా తిరిగిన ఆరిఫ్‌లో మార్పు కనబడసాగింది. జిందగి అంటే ఏంది...? పైలంటే ఏంది...? అని ఆలోచించసాగిండు. గిప్పుడు గిప్పుడు దునియా సమజయితంది. అడిగినప్పుడల్లా అబ్బా పైసలిచ్చేటోడు. తను జల్సాగా ఖర్చు పెట్టెటోడు. ఇప్పుడు ఎవల్ని అడుగాలె...? ఆరిఫ్ పరేశాన్‌ల పడ్డడు.

వహీద్ తమ్ముడు ఆరిఫ్‌కు సైకిల్ కంపెనీ అప్పజెప్పిండు. పొద్దుగాల మొకం కడుక్కొని అమ్మీ చాయ్‌బోత్తే బుద్ధిగ తాగి సైకిల్ కంపెనీకి వస్తుండు. ఊడ్చుకుంటుండు. టేలా, మీజు, బెంచి పేగుతోటి సాపు జేసుకుంటుండు. గిరాకీ కొరకు ఎదురు జూస్తుండు. వహీద్ పొద్దునుదాక దఫ్తర్‌ల డ్యూటీ చేచ్చి, తెల్లన్‌దాక తమ్మునికి రిపేర్లు, పంచర్లు జొడాయించి నేర్పిస్తుండు. గిరాకి తోటి ఎట్ల మెదలాల్నో చెబుతుండు. క్రమంగా ఆరిఫ్‌కు పనితోపాటు పరిస్థితులు అర్థమై తన్నయి. అప్పుడప్పుడు అన్నదమ్ములిద్దరికీ అబ్బాజాన్ యాదికచ్చి కండ్లల్ల నీళ్లు తిరుగుతున్నయి. అబ్బా ఉన్న ప్పుడు వహీద్ అవ్వమీది బువ్వగాని లెక్క మొదలిండు. గిప్పుడేమో బరువు బాధ్యతలు మీదపడ్డాయి.

దఫ్తర్ నుంచి అబ్బాజాన్ బాబతు ఫించను, జిపిఎఫ్ పైసలు అందినయి. పైసలు అటీటయితాయిని వెంటనే రిజువానా అత్తగారికి కట్నం బాబతు పైసలు

## ప్రేమంటే

తొలిచూపులో నీకు నాకు దొరికిన
అమరమైన క్షణం
బహుశా నీ చూపు
నా మేధస్సులో
పుష్పించి ఫలించి కవితారావమై పలుకడం
కోటి గొంతులు వద్దని వారించినా
నీ కోసం నా హృదయం తపిస్తుంది చూడూ
అదే ప్రేమంటే
ప్రేమంటే బహుశా
నీవు నావైపు నేను నీవైపు పయనించే
సుదీర్ఘ ప్రయాణం

–సబ్బని లక్ష్మీనారాయణ

చుప్తా జేసిండు. రిజువానాను అత్తగారింటికి పంపించిండు. రిజువానా అత్తగారింటికి పోయిందన్నమాటే గాని మొగనితోటి సంసారం చేసింది లేదు. సుఖపడింది లేదు. ఏవో సతాయింపులు. రిజువానా మొగుడు గైర్ జిమ్మదార్ మనిషి. నౌకరి లేదు. జులాయిగా తిరుగుతు పైసలు నీళ్లలా ఖర్చు చేస్తుండు. జల్సారాయుడు. కట్నం కజానా అయిపోయినంక రిజువానాను మల్లా తన తల్లిగారింటి నుంచి డబ్బులు తెమ్మని సతాయించుడు పెట్టిండు. కొడుతున్నడు. హింసిస్తున్నడు. రిజువానా వాటిని భరించలేక తెగాయించింది. "మా అన్న దగ్గర పైసల్లేవు గీసల్లేవు. నువ్వుద్దూ... నీ సంసారం వద్దూ...!" అంటూ కోపంగా మూటాముల్లె సదురుకొని తల్లి గారింటికి వచ్చింది.

ఆరిఫ్‌కు సైకిల్ల గిరాకీ తగ్గిపోయింది. మునుపటి లెక్క సైకిల్లు కిరాయకు పోతలేవు. ఊరికి బస్సులస్త న్నాయి. మోపెడ్లు, మోటార్ సైకిళ్లు తిరుగుతున్నాయి. పాలమ్మెటోళ్లు మోటార్ సైకిల్లు మీద పాలు తెచ్చి పోస్తున్నారు. పని పాటలోల్లు మోపెడ్ల మీద పోయి పనులు చేసుకుంటున్నారు. ఊళ్లె మేజులమీద పెట్రోలు సీసాలు పెట్టి అమ్ముతున్నరు. కాలం మారుతుంది. ఆరిఫ్‌కు ఈ జిందగి పసందయిత లేదు. దుబాయి పోయి ఏక్ దమ్‌న పైసలు కమాయించాలె! అన్న ఆశ కలిగింది. పోవుటానికి పైసలెట్ల...? ఆరిఫ్ పత్తాయించిండు. అబ్బా నౌకర్ని అన్న వహీద్‌కు ఇచ్చింద్రు. తనకు తగిన చదువులేకనే ఇవ్వలేదని బాధపడ్డడు.

"బయ్యా....! అబ్బా జాన్ నౌకరి తుజె మిలేనా...! నేను దుబాయి పోతా! పైసలు సంపాయించి శాది చేసుకుంట. పోవుటానికి జరా పైసలు ఇంతజాబ్ చెయ్యి బయ్యా" ఆరీఫ్ అడిగిండు వహీదును.

"మై కాంసే లావురే...!"అని నెత్తిగోక్కుంట చెప్పిండు వహీద్.

"బయ్యా...! ముజె కుచ్ నహీజాన్తా....! యాన్నుంచన్నా తెచ్చియ్యి" బజర్‌దస్తిగ అన్నాడు ఆరిఫ్. గత్యంతరం లేక వహీద్ ఓ రెండు దినాలు కాలుకు బట్టకట్టుకుంటూ తిరిగిండు. కొంత పైకం జమ చేసిండు. సైకిల్లు అమ్మిండు. ఆ పైసలు, ఈ పైసలు జమచేసి వహీద్ ఆరిఫ్‌కు ఇచ్చిండు. ఓ రోజున ఆరిఫ్ ఏజంటు ద్వారా దుబాయి ఎల్లిపోయిండు.

ooo

తల్లిగారింటికి వచ్చిన రిజువానా పరిస్థితి దీనంగా మారింది. వయసుల ఉన్న పిల్ల ఇంటి మీదుంటె తల్లి జిలాని బేగమ్ గుండె తరుక్కుపోతుంది. 'తండ్రి లేక పోయె పిల్ల పరిస్థితి ఎట్ల...' అన్న రంది జిలాని బేగమ్‌కు పట్టుకుంది. కుంపటి నెత్తిమీద ఉన్నట్టు బాధపడుతుంది. చుట్టుపక్కలోల్లు మాట్లాడే సూటిపోటి మాటలకు జిలాని పాణం సగం సచ్చిపోతోంది. రిజువానా భర్త మూర్ఖుడు. దుబారా మనిషి. దద్దమ్మ పైసలపిచ్చి ఉన్నోడు. రిజువానాకు తన మొగనితోటి పైసల బంధం తప్ప ప్రేమ బంధం లేదు. మనిషి, మనిషికి మధ్య వ్యాపార బంధమే కనబడుతుంది. దునియాల మనీబంధాలే తప్ప మానవ బంధాలు కరువయినయి. రిజువానా సంసారానికి గా దరిద్రమే దాపురించింది. ఊళ్లల్ల ఏ కులమోల్లయినా, ఏ

## నాడు - ఈనాడు

మానవాభ్యున్నతికి
మనుగడ సాగించేరు ఆనాడు
మారణ హోమాలతో
మెలిగేరు - ఈనాడు

ప్రజాహితమే
కోరారు - ఆనాడు
గతం మరచి
వెలిగేరు - ఈనాడు

పరువుకోసం
బతికారు - ఆనాడు
'బరువు' కోసం
వెతికేరు

పదవివద్దు
ప్రజాసేవ కానాడు
సదా ముద్దు
సీటే కదా ఈనాడు

పశ్చాత్తాపాలు లేవు
ప్రాణాలు -పోయినా
ప్రాయశ్చిత్తాలు - కావాలి
నిశ్చయంగా - నేటితరానికి

-శ్రీమాన్ కాశ్యప్

మతపోల్లయినా 'అన్నా, అక్కా మామా, బావా...! ప్రేమగా వరుసల తోటి పిలుచుకుంటరు. కష్టాలల్లి ఒగలు కొగలు తోడుంటారు.

వహీద్ పక్కిల్లే రామయ్య పటేలుది. రజాకార్ల మూమెంట్ల కమ్యూనిస్టులతోటి తిరిగిండట. ఎన్నో కష్టాలు పడ్డడట. ఒగసారి ఊళ్లోకు రజాకార్లు వస్తుండ్రని తెలిసి, ఇగజూసుకో తుమ్మల్‌చెర్లు... అనుకుంటూ రజాకార్లకు దొరకకుండా చేన్లల్లా, చెలకల్లా, కరీంనగర్ అనప గుట్టల్ల వడి ఊరకంగా రాయి తట్టుకొని బొక్క బొర్ల పడ్డడట. నొసలుకు దెబ్బ తగిలిందట. దాని తాలూకు బుర్రనొసలు మీద వుంది. అద్దంలా చూసుకున్నప్పుడల్లా రామయ్య కమ్యూనిస్టు భావాలు గల మనిషి. కులం తక్కువేంది. ఎక్కువేంది...? అందరూ సమానమే అంటాడు. పొద్దున్‌దాకా రెక్కలు కలికలి జేసుకున్నోనికి బుక్కెడు బువ్వదొరక్కపోతే... గిదేమి రాజ్యంరా అని బాధ పడతదు.

వహీద్ రామయ్య పటేలును రామయ్య మామ అని పిలుస్తుంటడు. రెండు కుటుంబాలు ఎంతో సోపతిగ ఉంటయి. ఒగల పండుగలకు ఒగలు వస్తరు. భోం చేస్తురు. రామయ్య పటేలు భార్య బీమారితోటి కాలం చేసింది. పెద్దమనిషి తనాన రామయ్య ఒంటరోడైయిండు. రామయ్యకు ఒక్కగానొక్క కొడుకు కిషోర్. వహీద్, కిషోర్ మంచి దోస్తులు. కిషోర్ పెద్ద చదువులు చదివి కొలువు జేస్తండు. కిషోర్ తండ్రిని తనతోటి పట్నంకు రమ్మన్నాడు.

"ఇది నన్ను కనిపెంచిన ఊరురా! ఎవలకైనా ఆఖరికి మిగిలేటియి జ్ఞాపకాలేరా... గవే నన్నికడినుండి కదలునిస్తలేవు... ఊళ్లె నా పోసలిగాళ్ల తోటి అప్పుడప్పుడు పొద్దుపుచ్చక గీ వయసుల మా ఆసోంటోళ్లకు గదే కాలక్షేపం! నువ్వు పో బిడ్డా! నేను పట్నం రాలేను! కానీ ఒక్కమాట బిడ్డా.... లగ్గం విషయల జల్దిన ఓ నిర్ణయం తీసుకో. నువ్వో ఇంటోడివయితే నా ఆరాటం బోతది" అని రామయ్య కొడుకుతోటి చెప్పి సాగనంపిండు.

రామయ్య సొంతూళ్లనే జిరాయితో చేయించుకుంటుండు. మామిడి తోటలకు కాపు మనిషిని బెట్టిండు. వంటకు ఓ పొలగాన్ని బెట్టుకున్నడు. సాయంత్రం పూట తన ఈడోల్లతోటి చావడికాడ రాయి చెట్టు కింద గద్దెమీద గతానుభవాలు నెమరు వేసుకుంట కాలక్షేపం చేస్తున్నడు. ముసలోడైనందుకు తన పానం మీద తనకే నమ్మిక లేక తెల్లనే దాకా అవతలికి, ఇవతలికి పట్టుక పోవుటానికి, మంచీ, చెడూ చూసుకుంటానికి వంటచేసే పొలగాన్నే ఇంట్ల పడుకునేటట్టు ఏర్పాటు చేసుకున్నడు. రామయ్య దక్కా మొక్కాలు తిన్న మనిషి, జీవితంల ఎంతో అనుభవం గడించినోడు. కష్టకాలంల ఊరోల్లు అతన్ని ఆశ్రయిస్తరు. అతను చక్కని సలహాలు ఇస్తడు. అందుకే రామయ్య అంటే ఊరందరికీ గౌరవం.

రిజువానా అప్పుడుప్పుడు రాయమ్మ ఇంటికి వచ్చి ఇల్లు ఊడ్చి బోల్లు తోమి పోతోంది. వాళ్ల ఇంట్ల ఏమన్న ప్రత్యేక వంటలు చేస్తే తెచ్చి ఇస్తుంది. ఆ ఇంటికి రామయ్య పటేలు అంటే అపారమైన గౌరవం. కిషోర్ తండ్రి రామయ్యకు అన్ని సౌలతులు ఏర్పాటుచేసి నౌకరు మీదకు బోయిండు. అన్నిటికంటె మించి మా నాయిన్నకు వహీద్ కుటుంబం ఆసరాగా ఉంటుందనే బరోసాలో పట్నం వెళ్లిండు. ఇప్పుడు రామయ్యకున్నదల్లా ఒకే ఒక రంది 'తన కొడుక్కు లగ్గం జేయాలె!' కాని వాడేమో ఆ ఊసే ఎత్తనిస్తలేదు. కిషోర్ మనసుల ఏముందో రామయ్యకు అంతు బడుతలేదు. తల్లి లేనోడాయె... ఏ వయసుల ముచ్చట గా వయసుల ఉండాలె. కొడుకు వయసేమో ముదరవట్టె....! రామయ్యకు దినాం గదే పత్తాయన.

○○○

అన్న వహీద్‌ను అరగొసవెట్టి, ఏదో సంపాయిస్తానని ఆరిఫ్ దుబాయి పోయిండు. అక్కడ అతనికీ పని సరిగా దొరుకతలేదు. తిరుగంగ, తిరుగంగ, ఓ బడా సేటు ఇంట్లో పని దొరికింది. సూర్యుడు లేవకముందే పోవాలె! ఇల్లు తుడవాలె... బోల్లు తోమాలె, నీళ్లు మోయాలె. బట్టలుతుకాలె, పాలు, తర్కారి తెవాలె, పిల్లల్ని తీసుక పోవాలె, దొడ్లు కడగాలె, కారు తుడువాలె...! అరొక్క పని జేయాలె. ఎప్పుడో పొద్దు బారెడెక్కినంక తినంగ మిగిలింది గింతంగ కుక్కకు పడేసినట్లు పడేస్తున్నరట. రంగుల కలలు గన్న ఆరిఫ్‌కు తన బతుకు కడుహీనమైందని కుమిలిపోతున్నడు. అమ్మ, అబ్బాను బెదిరించుకుని తిన్న రోజులు గుర్తుకు వస్తున్నయి.

ఓసారి సేటు ఇంట్ల చేతి గడియారం పోయిందట. అది ఆరిఫ్ తీసిండని లేని దొంగతనం అంటగట్టి, కొట్టి పనిలకెల్లి తీసేసింద్రట. ఆ గడియారం ఏమైందో ఆరిఫ్‌కు ఇప్పటికీ అంతుబడతలేదట. అతని బతుకు వీధిన పడ్డది. గిప్పుడు ఆరిఫ్‌కు తనోళ్లంతా యాదికచ్చి ఎక్కడేలని దుఃఖం ఎత్తేసుకస్తుందట.

చిన్నచిన్న పనులు జేసుకుంట తినీతిననట్టు రోజులు గడుపుతున్నడట. మన దేశానికి రావాలనుకుంటున్నట్లు.... పైసల్లేవని... పంపియ్యమని..... గిదంతా ఆరిఫ్ వహీద్‌కు ఉత్తరంల రాసిండట

వహీద్ తమ్ముని దీనావస్థ పట్ల దిగులు పడ్డడు. తమ్ముడు ఇండియాకు రావడానికి ఎట్టనన్న చేసి ఇంతజామ్ చేయాలనుకున్నాడు. వెంటనే రామయ్య పటేలు వద్దకు వెళ్లిండు. తమ్ముని పరిస్థితిని వివరించిండు. రామయ్య మామ పైసలు... అంటూ నసుగుతూ చేతులు నులుముకుంటూ వహీద్ నేలచూపులు చూస్తున్నాడు.

రామయ్య పటేలు ఆకాశంలోకి చూస్తూ ఆలోచించుడు పెట్టిండు. తల ఊపుతూ "సరేనయ్యా...! అట్లనే సాయంత్రం వచ్చి పైసలు తీసుకుపో. తమ్ముడు గంత ఇబ్బంది పడుతున్నప్పుడు ఎమ్మటే రమ్మని జెప్పయ్యా! మన దేశంల బతుకలేమా!" అని రామయ్య వహీద్‌కు పైసల ఇంత జామ్ చేసిండు. ఆరిఫ్ ఇండియాకు వచ్చిండు. ఇల్లు జేరిండు. అమ్మను, బయ్యాను పట్టుకొని ఇన్నాళ్లు దాచుకున్న దుఃఖాన్నంత ఎల్లబోసుకున్నడు.

○○○

కిషోర్, రిజువానాలు ఒకళ మీద ఒగలు మనసు పడ్డారన్న సంగతి ఎవలకు తెలవదు. ఇరుగు, పొరుగవ్వడం, కుటుంబ సంబంధాలు,... గవన్నీ వాళ్లు దగ్గరవ్వడానికి కారణమైనయి. చిన్నప్పటినుంచే వాళ్ల మధ్య ప్రేమ బీజం అంకురించింది. మతం, ఆచారం, సాంప్రదాయం, కట్టుబాట్లు వాళ్ల ఆలోచనలకు అడ్డుగోడలయినయి. వాళ్ల కోరికలని మనసుల్లోనే దాచేసుకున్నరు. మత బంధనాలకు కట్టుబడి ఉన్నరు. హద్దులు దాటలేదు.

మన్సూర్ రిజువానాకు వాళ్ల సాంప్రదాయం ప్రకారం ముస్లిం అబ్బాయితోటి షాది చేసిండు. రిజువానా తకబీర్ బాగాలేక, ఎటువంటి సంసార సుఖం నోచుకోక ఇంటికి వచ్చింది. తలాక తీసుకుంది. ఇప్పుడు మళ్లీ రిజువానా, కిషోర్‌ల మధ్య ప్రేమ చిగురులు తొడుగసాగింది.

రిజువానా పరిస్థితి పట్ల కిషోర్ జాలిపడ్డాడు. ఇంకో తరీకల అతని అంతరంగంల ఏదో తెలియని ఆనందానుభూతి పొందుతున్నాడు. ఆమెను ఎట్టనన్న జేసి తన జీవిత భాగస్వామిగా చేసుకోవాలన్న కోరిక అతన్ని నిలువ నియ్యడం లేదు. వీళ్లద్దరి మధ్య ఉత్పన్నమైన పవిత్ర ప్రేమను వహీద్ సూచాయిగా పసికట్టిండు. వాళ్లిద్దరిని కలిసి మాట్లాడిండు. అంతరంగాలు తెలుసుకున్నడు. సమజ్ చేసుకున్నడు.

ఓ రోజు కిషోర్ వహీద్ చేతులు పట్టుకొని "ఎట్ల నన్న జేసి నువ్వే మా పెళ్లికి పూనుకోవాలె...!" అని బతిమిలాడిండు. వహీద్‌కు ఏం చేయాల్నో మనసున వడత లేదు. ఓ దిక్కేమో మతం, ఆచారాలు, సాంప్రదాయాలు... ఇంకొదిక్కేమో పెద్దపులి లెక్క పెద్దమనిషి రామయ్య పటేల్....! ఎట్లయితే అట్లాయే అని ధైర్యం చేసి వహీద్ రామయ్య పటేల్ వద్దకు వెళ్లిండు. తటపటాయించుకుంటనే విషయం చెప్పిండు.

"నా చెల్లె రిజువానా జిందగి మీ చేతుల్ల ఉంది పటేలా...!" అంటూ వహీద్ రామయ్య కాళ్ల మీద పడ్డాడు. రామయ్యకు సంగతి అర్థం కాక బిత్తర పోయిండు. విషయమేమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసిండు. వహీద్ అసలు విషయం విడమర్చి చెప్పిండు. రామయ్య మొకంల రంగులు మారినయి. ఒక్కసారిగా గంభీరమై పోయిండు. అతని ఆలోచనలు పరిపరి విధాల సాగుతున్నయి. పిల్ల సక్కంగానే ఉంది.... చదువుకుంది... ఒగల మీద ఒగలు మనసు పడ్డారు... పల్లెటూరి పిల్ల. బాష ఇబ్బంది గూడలేదు. కొడుకు ఇష్టపడుతున్నాడు. సమాజంల ఎన్నో సమస్యలు... మత ఘర్షణలు... సాంప్రదాయాల పోరాటం.... ఆచారాల ఆరాటం.... కొడుకు సుఖం ముందు ఇవేమీ గుర్తుకు రాలేదు రామయ్యకు. మతమనే మాయరోగంల మనిషి మానవత్వాన్ని మరిచి పోతున్నడు. రామయ్య గాఢంగా నిట్టూర్చిండు. ఏం జేయాల్లో పత్తాయించుతున్నడు.

గీ మతాలు, కులాలు, ఆచారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు అన్నీ కల్పితాలయిన అడ్డుగోడల్లా భావించిండు, రామయ్య పటేల్. వీటి అసలు మూల సూత్రాలు అడుగున పడి వికృతమైన రూపాలు వెలుబడుతున్నాయని అనుకున్నడు. మనిషికి గుణం, చదువు సంస్కారం, బతికే నేర్పు, ఓర్పుగావాలె గానీ గివన్నీ ఎందుకు...? అనే ప్రశ్న అతని గుండెల్లో తలెత్తింది. కిషోర్, రిజువానాలది పవిత్ర ప్రేమ సంగమంగా, మమతల సంగమంగా... మతాతీతమైన మానవత్వపు సంగమంగా భావించుకుండు రామయ్య పటేల్. భావోద్వేగంతో ఓ దృఢమైన నిర్ణయానికొచ్చిన వాడిలా మెరిసే కళ్లతో రామయ్య పటేల్ వహీద్ వైపు చూస్తూ బరోసా ఇస్తున్నట్లుగా తల ఊపిండు. ■